# ది లేట్ ట్రెయిన్

**ఎన్నాళ్ల తర్వాతో నేను డెహ్రా వెళ్తోంది. దాదాపు ఐదారేళ్లు కావస్తోంది. 'నా' అని చెప్పుకునే ఉన్న ఒక్కగానొక్క నాన్నమ్మ కాలధర్మం చెందడంతో అక్కడకు వెళ్లవలసిన అవసరం నాకు మళ్లీ రాలేదు.**

రావలసిన రైలు ఓ గంట ఆలస్య మనుకున్నది, రెండు గంటలు ఆలస్యంగా వచ్చింది, దాని విధ్యుక్తధర్మాన్ని అది నిర్వర్తిస్తూ. వెంటనే కార్నర్ సీటు ఆక్రమించి బ్రీఫ్ కేసు తెరిచాను. వెంట తెచ్చుకున్న హెరాల్డ్ రాబిన్స్ నవల 'నెవర్ లవ్ ఏ స్ట్రేంజర్' తెరిచాను. కానీ దాని మీద మనసు ఏ మాత్రం లగ్నం చేయలేక పోతున్నాను.

మళ్లీ అదే ఆలోచన! ఆ ఆలోచన రాగానే హృదయ స్పందన ఉద్ధృత మైంది. ఇంతకూ ఆ అమ్మాయి ఏమైనట్లు? ఏమో! ఇది మాత్రం అయోమయమే తప్పించి అంతు తెలీని గాథ. ఇప్పటికీ ఆమె రూపం నా కళ్ల ముందు అచ్చు గుద్దిన ట్లు మెదులుతూనే ఉంది.

దాధాపు ఐదారేళ్ల నాటి మాట! అప్పుడు నేను ఢిల్లీలో కాలేజీలో చదువుతున్న రోజులు. సెలవు లొస్తే వెంటనే డెహ్రా పరుగెత్తే వాణ్ని, నాన్నమ్మ దగ్గరకు. నాకున్న ఏకైక బంధం అప్పుడు నాన్నమ్మే!

డెహ్రాకు దాదాపు ముప్పై మైళ్ల దూరంలో ఉన్న ఓ చిన్న కుగ్రామం దేవ్‌లీ. దేవ్‌లీ స్టేషనులో రైలు పది నిముషాలు ఆగుతుంది.

అక్క డసలు రైలు ఎందు కాగుతుందో ఎవరికీ తెలియ దు. దేవ్‌లీ చాలా చిన్న స్టేషను. ఉన్న ఒకే ఒక్క చిన్న ప్లాట్ ఫారమ్. దాని మీద స్టేషన్ మాస్టర్ కోసం ఓ చిన్న ఆఫీసు రూమ్. దాని పక్కనే ఓ మామూలు టీ స్టాల్, కూర్చునేందుకు రెండు మూడు సిమెంట్ బెంచీలు. తప్పించి మరేమీ లేవు. ఆ ఒంటరి స్టేషన్‌ను చూసినప్పుడల్లా ఏదో తెలీని బాధ నా అంతరాల్లో సుళ్లు తిరిగేది. ఎప్పుడైనా వీలైతే అక్కడ దిగి ఆ ఊరు చూసి రావాలన్న ఆలోచన కూడా అప్పట్లో నాకు లేక పోలేదు.

అటువంటి ఆలోచనతో ఉన్నప్పుడే... అప్పుడు నా వయస్సు పద్దెనిమిదేళ్లు. సెలవులకు ఓ సారి ఢిల్లీ నుంచి డెహ్రా వెళ్తున్నాను. ఆ రాత్రి రైలు దేవ్‌లీ స్టేషన్‌లో ఆగింది. అప్పుడే తెలతెల వారుతూంది.

కిటికీ లోంచి ప్రత్యూషాన్ని అలాగే తిలకిస్తున్నాను. ఇంతలో నారతో అల్లిన ఓ రకమైన బుట్టలు, ఎంతో కళా త్మకమైనవి చేతిలో పట్టుకుని అమ్మడానికని స్టేషన్‌లోని ప్లాట్ ఫార మ్మీదికి వస్తున్న ఓ అమ్మాయి, పదహారేళ్లు దాటని పడుచు ప్రత్యూషంతో ఉదయించిన కిరణమ్మయిలా కనిపించింది.

ఆమెలో ప్రకృతి ప్రసాదించిన సహజసిద్ధమైన అందం మరింత వికసిస్తూ కనిపిస్తోంది. ఆమె వైపు నుంచి దృష్టి మరల్చుకోలేక పోతున్నాను. ఉన్నట్లుండి ఆ అమ్మాయి సరాసరి నా దగ్గరకు వచ్చి "బాబుగారూ! ఈ నార బుట్ట శానా బావుంటది. కొనండీ!" అని అడిగింది.

నేను మాత్రం ఆమె అభ్యర్థన ఆలకించే స్థితిలో లేను. ఆమె అందాన్ని నా చూపులతో ఆస్వాదించే ప్రయత్నంలో ఉన్నాను. ఏమనుకుందో ఏమో, పరుగు లాంటి నడకతో వెళ్లిపోయింది.

అన్ని కంపార్ట్‌మెంట్ల దగ్గరకూ పరుగెడుతూ అందర్నీ అడుగుతోంది వాటిని కొనమని. తిరిగి మళ్లీ వెనక్కి తిరిగొస్తూ, నేను కూర్చున్న కంపార్ట్‌మెంట్ దగ్గర ఆగి పోయింది.

నేను ఆమెను అలాగే చూస్తుండి పోయాను తప్పించి, మాట్లాడించే ప్రయత్న మేమీ చేయలేక పోయాను. 'కనీసం మీరైనా ఒకటి కొనండి బాబూ' అన్నట్లు చూస్తూండి పోయింది ఆ అమ్మాయి నా వైపు.

ఈ నార బుట్ట అవసరం నాకు లేదని చెప్పేద్దా మనుకున్న వాణ్ని కూడా, ఎందుకో మరి, ఆ అమ్మాయి చూపుల్లో తొణికిసలాడుతున్న దీనత, అమాయకత్వం, ఆర్తి, అణకువ నన్నలా చెప్పకుండా ఆపేశాయి.

వెంటనే ప్లాట్ ఫార మ్మీదకు దిగి "సరే, ఒక టివ్వు" అంటూ ఆ నార బుట్ట తీసుకుంటూ యథాలాపంగా ఆమె చేతి వేళ్లు తాకాను. అంతే! ఆ స్పర్శ నాలో మధుర సంగీతాన్ని ఆలపించింది. నిజానికి ఆ స్పర్శ ... ఇంత కంటే ఇక చెప్పలేను!

జేబులో నుంచి పర్స్ తీసి ఇరవై రూపాయల నోటు ఇచ్చాను. చిల్లర లేదంది. ఈ లోపు గార్డ్ విజిల్ వేయడం, వెంటనే రైలు కదలడంతో చేసేది లేక "చిల్లర కూడా నువ్వే ఉంచేసుకో" అని చెప్పి, వెంటనే రైలు ఎక్కాను. అలాగే తలుపు దగ్గర నిలబడి కనుచూపు మేర వరకు ఆ అమ్మాయి వైపే చూస్తుండి పోయాను. ఆ అమ్మాయి కూడా ప్లాట్ ఫారం మీద నిల్చుండి పోయి చేతిని గాల్లో ఊపుతూ, నవ్వుతూ నాకు గ్రాండ్ సెండాఫ్ ఇచ్చింది.

తర్వా తంతా ఆమె రూపమే నా కళ్లల్లో కదలాడుతూ ఉంది. ఎన్నో సార్లు ఆమెను నేను గుర్తు చేసుకున్నాను. తర్వాత తర్వాత రొటీన్‌లో పడిపోయి బహుశా, మరిచి పోయినట్లున్నాను.

సెలవు లయిపోయాయి. నాన్నమ్మ దగ్గర సెలవు తీసుకుని ఢిల్లీ తిరుగు ప్రయాణ మయ్యాను. అప్పుడు మామూలుగానే దేవ్‌లీ రాగానే స్టేషన్లో రైలు ఆగింది. కిటికీ లోంచి అలాగే బయటకు చూస్తున్న నాకు చేతిలో నార బుట్టలతో వస్తున్న ఆ అమ్మాయి ... ఆ అమ్మాయే కనిపించింది. ఇక అంతే, నా ఆనందానికి ఆకాశమే హద్దయింది. వర్ణనాతీతమైన సంతోషంతో వెంటనే రైలు దిగాను.

ఆమె వైపు చూసి నవ్వాను. ఆ అమ్మాయి కూడా నా వైపు చూసి నవ్వింది. బహుశా తనను నేను ఇంకా గుర్తు పెట్టుకున్నందుకు ఎంతో సంతోషించి ఉండాలి.

నేను, నా ఎదురుగా నిల్చున్న ఆ అమ్మాయి! ఇక అక్కడ పెద్ద జనసందోహం లేదు. మే మిద్దరం ఒకరి కళ్లలోకి ఒకరం అలాగే చూసుకుంటూ నిలబడి పోయాము. అసంకల్పితంగానే ఆమె చేతిని దగ్గరకు తీసుకుని నా పెదాలతో స్పృశించాను. అందుకు ఆ అమ్మాయి నిరాకరించ లేదు కూడా. ఆమె చేతి స్పర్శతో నా యువరక్తం సుళ్లు తిరుగుతూ పరవళ్లు తొక్కింది.

"నేను ఢిల్లీ వెళ్తున్నాను. అక్కడే నేను చదువుకుంటున్నాను" అన్నాను. అలాగా అన్నట్లు తలూపింది.

"మీ ఇల్లు ఇక్కడేనా?" అని అడిగాను. మళ్లా తలూపింది.

"నీకు పెళ్లయిందా?" అని అడగాలనిపించీ, ఎందుకో గానీ అలా అడిగే ధైర్యం చేయలేక, "నీ వెవరితో ఉంటున్నా వు?" అని మాత్రం అడిగాను.

"నాకు మా ముసలి అవ్వ తప్పించి ఎవ్వరూ లేరు" అంది బాధ నిండడంతో జీరబోయిన గొంతుతో.

ఇద్దరం ఒకే గూటి పక్షుల మన్న మాట!

"మరి నాతో మా ఊరొస్తావా?" అడిగాను.

"అమ్మో! మీ పట్న పోళ్లను, సదూకు న్నోళ్లను నమ్మకూడ దటగా!" అంది ఎంతో అమాయకంగా.

"నన్ను కూడా నమ్మవా?" అడిగాను.

"మిమ్మల్ని నమ్ముతా లేండి!" చెప్పింది.

"మరి నాతో వచ్చేస్తావా?"

"దేనికి?"

ఇంతలో గార్డు విజిల్ వేయడంతో వెంటనే "నేను మళ్లీ వస్తానే" అంటూ పరుగెత్తుకెళ్లి కంపార్టుమెంటులోకి ఎక్కేశాను.

తొలి చూపులోనే కాదు, మలి చూపులో కూడా విఫలం కాకపోతే అదే నిజమైన ప్రేమావిష్కరణ! అన్నా డో మహానుభావుడు. బహుశా ఇది నూటికి నూరు పాళ్లూ నిజమే నేమో అనిపిస్తోంది. నేను ఆ అమ్మాయిని నిజంగానే ప్రేమిస్తున్నానేమో!

ప్రేమకు అర్హతగా చిరునామాలు కావాలా? ఊహూఁ! ప్రేమికులకు చిరునామా ప్రేమే కదా!

తర్వాత కూడా ప్రతి క్షణం ఆ అమ్మాయే గుర్తొస్తుం డేది. ఇక ఆమెను మరిచి పోవడం నా వల్ల కాదన్న తీర్మానాని కొచ్చేశాను.

అంతకు ముందు నుంచే నాన్నమ్మ "చదువు పూర్తవడం సంగతి పక్కన పెట్టు. వెంటనే నీ పెళ్లి జరిపిం చేయాలి" అంటూ గొడవ చేస్తున్నా పెళ్లి మీద నాకే మాత్రం ధ్యాస కలగలేదు. కానీ ఆ అమ్మాయితో ఏర్పడిన పరిచయంతోనే నా ధ్యాసంతా పెళ్లి మీదకు మళ్లింది.

నాన్నమ్మను ఒప్పించి ఈ అమ్మాయినే నేనెందుకు పెళ్లి చేసుకోకూడదు? అనిపించింది. ఆ ఆలోచనే నా కెం తో ఆనందా న్నిచ్చింది.

ఫైనల్ పరీక్షలు రాసేసి తిరిగి డెహ్రా ప్రయాణ మయ్యాను. దేవ్‌లీ స్టేషన్ దగ్గర పడుతుం దంటేనే నా మనసు ఆనందంతో ఉక్కిరిబిక్కి రవుతోంది.

రైలు దేవ్‌లీ స్టేషన్‌లో ఆగింది. వెంటనే ప్లాట్ ఫారమ్ మీదకు దిగాను. ఆమె కోసం నా కళ్లు ఉత్సాహంగా వెదుకుతున్నాయి. కానీ నా అమ్మాయి కనిపించ లేదు. అక్క డంతా వెదికాను. స్టేషన్ బయట కూడా చూశాను. కానీ ఆమె జాడ లేదు.

టీ స్టాల్‌వాణ్నీ, స్టేషన్ మాస్టర్నీ అడిగి చూశాను. వాళ్లు వింతగా నా వైపు చూసి తెలీ దంటూ తేలిగ్గా కొట్టి పడేశారు.

నాలో వేదన సన్నగా మొదలై అణువణువునా వ్యాపిస్తోం ది. బిగ్గరగా ఏడవా లనిపిస్తోంది.

ఇప్పుడు కానీ నా కర్థం కాలేదు. నాకు తెలీకుండానే నేను ఆమెను ఎంత గాఢంగా ప్రేమిస్తోందీ! జీవితంలో అతి పెద్ద విషాదం చావు కాదు, ప్రేమించడం ఆగి పోవడమే!

అలా ఓడి పోయి తిరిగెళ్లి పోవడానికి మనసు అంగీకరించ లేదు. అందుకే దేవ్‌లీ గ్రామం మొత్తం గాలించైనా సరే, ఆ అమ్మాయిని కలుసుకోవాలని దృఢంగా నిశ్చయించుకుని బ్యాగు తీసుకుని ఊళ్లోకి బయలు దేరాను.


ఊరంతా గాలించాను. నార బుట్టలు అల్లే వాళ్ల దగ్గరికి వెళ్లి విచారించాను. బహుశా నేనలా గుచ్చి గుచ్చి అడగటంతో భయపడిన ట్లున్నారేమో, సమాధాన మేమీ చెప్పకుండానే మాకు తెలీ దన్నట్లు ఊరుకుండి పోయారు.

ఇక చేసేది లేక తిరిగి సాయంకాలం ఎప్పుడో వచ్చిన మరో లోకల్ రైలు ఎక్కి డెహ్రా వెళ్లి పోయాను. నన్ను చూసి నాన్నమ్మ చాలా సంతోషించింది.

క్రమక్రమంగా ఆ అమ్మాయిని మరిచి పోయాను. ఇక ఈ లోపు నాకు ఢిల్లీలో ప్రభుత్యోద్యోగం రావడం. నాన్నమ్మ నా కోసం చూసిన మరో సంబంధం అతి కష్టమ్మీద ఒప్పుకుని పెళ్లి చేసేసుకోవడం, ఢిల్లీలో స్థిరపడడం జరిగి పోయాయి.

ఇప్పటికీ నేను ఆ అమ్మాయి దగ్గర కొన్న నార బుట్టను అపురూపంగా దాచుకున్నాను.

మళ్లీ ఇన్నాళ్లకు పుట్టిపెరిగిన డెహ్రానూ, అక్కడి వాతావరణాన్నీ, అలాగే నా ప్రియురాలి గుర్తుగా కనీసం దేవ్‌లీ స్టేషన్నైనా చూసి రావా లనిపించి, "ఆఫీస్ క్యాంప్" అని అబద్ధం చెప్పి, ఇలా




బయలుదేరాను.

మధ్యలో మూసి ఉంచిన హెరాల్డ్ రాబిన్స్ నవల 'నెవర్ లవ్ ఏ స్ట్రేంజర్' పేరు చూస్తుంటే నన్ను ఉద్దేశించే అంటున్నట్లుగా తోస్తోంది నాకు.

ఎప్పట్లా రైలు దేవ్‌లీ స్టేషన్ కొచ్చేసరికి చాలా ఆలస్య మైంది. కిటికీ లోంచి ప్లాట్ ఫారమ్ వైపు చూడా లంటే ఎందుకో గానీ, ధైర్యం చాలడం లేదు.

ఉన్నట్లుండి కిటికీ పక్కన నిలబడి "బాబుగారూ! నార బుట్టలు కావా లాండీ?" అని అర్థింపుగా అడుగుతూ నిల్చున్న ఓ స్త్రీని చూడగానే నాలో సంభ్రమాశ్చర్యాలు!

నన్ను నేను నమ్మలేక పోయాను. కళ్లు నులుముకుని పెద్దవి చేసుకుని మరీ చూశాను. అనుమానం లేదు ...! ఆమే! అప్పటి ఆ అమ్మాయే!

లోతుకు పోయిన చెంపలు, కళ్ల కింద నల్లటి చారలు, ఆమె చేతిలో కొన్ని నార బుట్టలు, మరో చేతి భుజానికి వేలాడుతోన్న పాత గుడ్డ ఊయలలో ఓ పసి బిడ్డ!

ఆమె వైపు అలాగే భావగర్భితంగా చూస్తుండి పోయాను. ఆమె నన్ను గుర్తు పట్టినట్లు లేదు. బహుశా మరిచి పోయిందేమో! నేను కూడా ఆమెతో మాట్లాడే ప్రయత్నం చేయలేదు.

పావు గంట దాటి పోయింది. గార్డు ఇంకా విజిల్ వేయ లేదు. పక్కన ప్రయాణికులు ఇద్దరు ముగ్గురు "ఇప్పటికే రెండు గంటలు ఆలస్యంగా నడుస్తోంది. ఇంకా ఆలస్యం చేస్తున్నారు. షిట్!" అంటూ విసుక్కుంటున్నారు.

అప్పుడు నే ననుకున్నాను, "కానీ నేను ప్రయాణం చేద్దా మనుకున్న రైలు ఓ జీవితకాలం ఆలస్యం!" అని.

(రస్కిన్ బాండ్ కథ 'ది నైట్ ట్రెయిన్ ఎట్ దేవ్‌లీ' చదివాక ...)